# మరువకుమా... ఓ ప్రియతమా

డా. గూటం స్వామి




**రా**జమండ్రి రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిట లాడుతుంది.

గౌతమి ఎక్స్‌ప్రెస్ కోసం ప్రయాణీకులంతా నిరీక్షిస్తున్నారు. మరో ఐదు నిమిషాల్లో ఒకటవ నెంబర్ ఫ్లాట్‌ఫాంమీదకి రైలు వస్తుందని ఎనౌన్స్‌మెంట్ చేశారు.

ప్రయాణికులంతా ఎలర్ట్ అయ్యారు.

అమరేంద్ర హడావిడిగా స్టేషన్‌కు వచ్చాడు. అప్పటికే గౌతమీ ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో ఆగి ఉంది. గబగబా లగేజీని ఈడ్చుకుంటూ ఎస్.7 బోగి ఎక్కాడు అమరేంద్ర.

హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

అమరేంద్ర టీచర్‌గా పనిచేసి ఈ మధ్యే రిటైర్ అయ్యాడు.

వరంగల్‌లో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న తన కొడుకు రాహుల్‌ను చూడాలని బయలుదేరాడు. ఉద్యోగానికి విరమణ ఉన్నా జీవితానికి విరమణ ఎప్పుడు వస్తుందా...! అనుకుంటూ జీవితాన్ని భారంగా నెట్టుకొస్తున్నాడు అమరేంద్ర. భార్య శ్రీలక్ష్మి ఐదు సంవత్సరాల క్రితమే జీవితం నుంచి రిటైర్ అయ్యింది. ఆ ఒంటరి తనం అమరేంద్రను మరింత వేదిస్తుంది.అందుకే కొడుకు దగ్గర కొన్నిరోజులు ఉందామని వరంగల్ బయలుదేరాడు.

బెర్త్‌పై కూలబడ్డ అమరేంద్ర చేతి సంచిలోని వాటర్‌బాటిల్ తీసుకుని నీళ్ళు తాగాడు.

రాజమండ్రి స్టేషను నుంచి రైలు కదిలింది. రెండు నిమిషాల్లో గోదావరి బ్రిడ్జి పైకి వచ్చింది.

కొంతమంది ప్రయాణికులు గోదావరిలో చిల్లర డబ్బులు వేస్తున్నారు. అవి బ్రిడ్జికి ఉన్న ఇనుప చట్రాలకు తగిలి గళ్ళు గళ్ళు మని శబ్దం చేస్తూ 'గురి తప్పిన బాణాల్లా వట్టాలపై పడిపోతున్నాయి. కొన్ని పైసలు మాత్రం ఆ తల్లి కడుపులోకి చొచ్చుకుపోయి చలామణి కాని నాణాల జాబితాలోకి చేరిపోతున్నాయి.

గోదావరిపై నుంచి వీచే పిల్లగాలులకు అమరేంద్ర మనస్సు కాస్త సేదతీరింది.

విద్యుత్ దీపాల కాంతులతో నదీతీరం దగ దగ మెరిసిపోతుంది. స్నానాల రేవుల్లో ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద విద్యుత్ బల్బుల కాంతి నదిలో పడి ప్రతిబింబిస్తున్నాయి. నీళ్ళు అడుగులో లైట్లు వెలుగుతున్నట్లు అనుభూతి. పాతికేళ్ళ క్రితం రాజమండ్రికి, ఇప్పటి రాజమండ్రికి పొంతన లేదు అనుకున్నాడు అమరేంద్ర.

గోదావరి మధ్యలోని ఇసుక తిన్నెలపై మత్స్యకారుల గుడిసెల్లోని కిరసనాయిల్ దీపాలు మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నాయి.

గోదావరి గాలిలో కలిసిపోయి అప్పుడప్పుడు గుప్పుగుప్పున పేపర్ మిల్లు వాసన కాస్త ఇబ్బంది పెట్టినా ప్రకృతి సోయగాల ముందు ఆ కంపు ఇంపుగానే అనిపిస్తుంది. అనుకున్నాడు అమరేంద్ర.

రైలు గోదావరిని దాటి కొవ్వూరు స్టేషన్‌కు చేరుకుంది. బిలబిల మంటూ ప్రయాణికులు ఎక్కారు.

రెండు నిమిషాల అనంతరం బండి కదిలింది.

ఎస్.7 బోగీ అంతా నిండిపోయింది.

అక్కడక్కడ కొంతమంది తెచ్చుకున్న భోజనం ప్యాకెట్లు విప్పుకుని తింటున్నారు. మరికొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. అమరేంద్ర ఎక్కువ సేపు కూర్చోలేకపోయాడు. తన బెర్త్‌పై నడుం వాల్చాడు. తల క్రింద సూట్‌కేస్‌ను దిండుగా పెట్టుకున్నాడు. బ్యాగ్ లోంచి దుప్పటి తీసుకుని కప్పుకున్నాడు.

అన్ని బెర్త్‌లు నిండుగా ఉన్నాయి.

సైడ్ బెర్త్‌పై ఒకావిడ కాళ్ళు చాపుకుని కూర్చోవడం అమరేంద్ర కంటబడింది.వయస్సు ఏభై దాటి ఉండొచ్చు అంత వయస్సులోనూ చక్కగా ఉంది.

అమరేంద్ర చూపులు ఆమెవైపు ప్రసరించాయి.

ఎక్కడో చూసిన ముఖంలాగే ఉంది అనుకున్నాడు అమరేంద్ర. ఆమె వెంటనే అమరేంద్రను గమనించి ఆమె ముఖాన్ని రివ్వున తిప్పేసుకుంది.

ఆ సన్నివేశంతో అమరేంద్ర కాస్త షేమ్ ఫీలయ్యాడు. రైలు నిడదవోలు జంక్షన్ దాటి విజయవాడ వైపు పరుగులు తీస్తుంది. అమరేంద్ర ఆలోచనలూ అంతే వేగంగా పయనిస్తున్నాయి.

★ ★ ★

అమరేంద్ర మరోసారి ఆమె ముఖాన్ని చూడటానికి ప్రయత్నించాడు. ఆమె కట్టుకున్న లైట్‌బ్లూ సారీ తన గతాల దొంతర్లను కళ్ళముందు పరుచుకునేలా చేసింది.

కాలేజీ రోజులు అమరేంద్ర స్మృతి పథంలో మెదిలాయి.

కాలేజీ వార్షికోత్సవానికి స్వాతి అచ్చం అలాంటి సారీయే కట్టుకొచ్చింది. ఆ చీరలో ఆమె ఎంత అందంగా ఉందో.... స్నేహితులంతా ఆ రోజు తనను ఆట పట్టించడం బాగా గుర్తుంది. ఆమె అందానికి ఆ కలర్ మరింత సోయగాలను అద్దింది. ఆమె ప్రేమ పొందడానికి పడిన పాటు అమరేంద్ర స్మృతి పథంలో కదిలాయి.

ఆరోజు ధైర్యం చేసి నోట్‌పుస్తకం అట్టలో ఉంచిన ప్రేమలేఖను తలచుకుని నవ్వుకున్నాడు అమరేంద్ర.

నెమ్మదిగా కాదు కాస్త గట్టిగానే నవ్వాడు.

ఆ నవ్వుకు ఆ బెర్త్‌లో వాళ్ళంతా అమరేంద్ర వైపు చూశారు. సైడ్ బెర్త్‌పై ఉన్న ఆమె కూడ నవ్వడం అమరేంద్ర గమనించక పోలేదు.

కళ్ళు మూసుకున్నాడు అమరేంద్ర. ఊహాలోకంలోకి వెళ్ళిపోయాడు.

ప్రేమలేఖ ఇచ్చినతర్వాత రెండు రోజులు కాలేజీకి డుమ్మా కొట్టేసాను. మూడోరోజు ధైర్యం చేసి కాలేజీకి వెళ్ళిన తనకు స్వాతి పలకరింపు వేయి వసంతాలు ఒకేసారి వచ్చినంతటి

స్వగృహ ఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building).
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net
ఉగాది
మరియు
శ్రీరామనవమి
శుభాకాంక్షలు

అనుభూతి కలిగించింది. ఖాళీ పాత్రలో జీవన మధువు నిండిపోయి ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేసే ఆనందం. తనువులోని అనువనువు హిమబిందువును స్పృశించి నాట్యమాడే మయూరంలా నర్తిస్తున్నట్టు పులకింత.

ఆరోజు నుంచి ప్రతిరోజు మాకు వసంతమే. ఆమె మాట్లాడుతుంటే నా మనస్సు రాగ రంజితమై సుస్వరాలు పలికేవి. ఆమె కనిపించని రోజు చుట్టూ చీకట్లు పరుచుకునేవి.

అమరేంద్ర ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ టి.సి. టికెట్ చూపించమని తట్టి లేపాడు. పర్సులోంచి టికెట్ తీసి చూపించి మరలా ఆలోచనల్లోకి ఒదిగిపోయాడు.

మూడు సంవత్సరాలు మూడు క్షణాల్లా గడిచిపోయాయి. చివరిరోజు నాకు బాగా గుర్తుంది.... గోదావరి నది ప్రక్కన మెట్లపై ఇద్దరం మౌనంగా కూర్చున్నాం. ఉబికి వస్తున్న కన్నీళ్ళు మా ముఖాలపై నుంచి జారి మా గుండెలను చల్లబర్చే ప్రయత్నం చేస్తున్నాయి. మా దుఃఖాన్ని పోగొట్టడం కోసమా... అన్నట్టు గోదావరి పై నుంచి వీచే పిల్లగాలులు మా కన్నీళ్ళు ఆరిపోయేలా చేస్తున్నాయి.

అప్పుడు ఆమె ఒక డైరీని నా చేతిలో ఉంచుతూ ఆమె పలికిన మాటలు నాకిప్పటకీ గుర్తే.... అమర్ ఇది నా జ్ఞాపకంగా నీకు ఇస్తున్నాను..... దీన్ని భద్రంగా ఉంచుతావు కదా! అంది స్వాతి.

ఆ మాటలకు నా కళ్ళు జలపాతా లయ్యాయి. నా చేతిలో ఉన్న డైరీపై కన్నీళ్ళు పడి మెరుస్తుంది. దుఃఖిస్తూనే డైరీ తెరిచి చూశాను. అందులో మొదటి పేజీపై ఉన్న అక్షరాలు నా గుండెను రెండు ముక్కలు చేశాయి you live in my heart till live అనే అక్షరాలు నా దుఃఖాన్ని రెట్టింపు చేశాయి. నా చేతిని తన మృదువైన పెదవులతో స్పృశించింది.

మబ్బుల చాటుకు వెళ్ళిన సూరీడు మబ్బుల్ని ఛేదించుకుని బయటపడ్డాడు,

మేమిరువురం జ్ఞాపకాలను గోదారమ్మ ఒడిలో పదిలపర్చి అక్కడ నుంచి లేచాం. ఆమెను వీడ్కొలిపి భారమైన హృదయంతో నేనక్కడే ఉండిపోయాను. ఆమె వీధి మలుపు తిరిగే వరకు అలా చూస్తుండిపోయాను. చివరిసారిగా ఆమె వెనుదిరిగి చూసిన చూపు నా మనోఫలకంపై ఇప్పటికీ నిక్షిప్తమై ఉంది. ఆమె ఇచ్చిన డైరీ ఇప్పటికి నా సూట్‌కేస్‌లో భద్రంగా ఉంద.

ట్రైన్ వేగంగా వెళ్ళడం వల్ల ఏర్పడిన కుదుపులకు బరువుగా కళ్ళు తెరిచాడు అమరేంద్ర.

బోగీలో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. అమరేంద్ర నెమ్మదిగా లేచాడు. సూట్‌కేస్ తెరిచి సీక్రెట్ అరలోంచి ఒక డైరీ బయటకు తీసాడు. డైరీ అట్టపై ఉన్న గోల్డ్ లెటర్స్ దగదగ మెరుస్తున్నాయి.

అమరేంద్ర దృష్టి సైడ్ బెర్త్‌పై నిద్రిస్తున్న ఆమెపైకి మళ్ళాయి. హాయిగా నిద్రపోతుం దామె. ఒంటిపై బ్లాంకెట్ కప్పుకుంది.

ముఖంమాత్రం బయటే ఉంది. బోగీలో వెలుగుతున్న బ్లూ లైట్ ఆమె ముఖంపై పడి ఆమె ముఖ వర్చస్సును రెట్టింపు చేస్తుంది.

ఓ వెచ్చటి స్పర్శ బుగ్గపై నుండి జారి హృదయం వరకూ పాకింది. అమరేంద్ర డైరీ తెరిచాడు. సూట్‌కేస్‌లో ఉన్న పెన్ తీసాడు. అమరేంద్ర డైరీలో ఏదో రాసి మూసేసాడు.

రైలు విజయవాడ దాటి వరంగల్ వైపు పరుగులు తీస్తుంది.

అమరేంద్రకు నిద్ర పట్టడం లేదు. బెర్త్‌పై అటూ ఇటూ దొర్లుతున్నాడు. మూడుగంటల పాటు విపరీతమైన టెన్షన్ అనుభవించాడు అమరేంద్ర.

రైలు వరంగల్ వచ్చేసరికి తెల్లవారు జాము అయ్యింది. బండి వరంగల్ స్టేషన్‌లో ఆగింది.

అప్పటికే అన్నీ సర్దుకుని ఉన్న అమరేంద్ర ఒకసారి పరిసరాలను గమనించాడు అంతా నిద్రలో ఉన్నారు.

సైడ్ బెర్త్‌పై ఆదమరచి నిద్రిస్తున్న ఆమెను మరోసారి తృప్తిగా చూశాడు అమరేంద్ర. చేతిలోని డైరీని ఆమె తల దగ్గర ఉంచి నెమ్మదిగా దిగిపోయాడు. నలభై ఏళ్లపాటు మోసిన సుదీర్ఘమైన బంధం ఏదో తనను విడిచి పోయినట్టుగా అనిపించింది.

భారమైన హృదయంతో నడుచుకుంటూ స్టేషన్ బయటకు వచ్చేశాడు అమరేంద్ర.

స్టేషన్ బయట కారుతో సిద్ధంగా ఉన్న తన కొడుకును ఆప్యాయంగా కౌగలించు కున్నాడు.

అమరేంద్ర కళ్లు ఎర్రగా చింత నిప్పుల్లా ఉన్నాయి.

దుఃఖ భారంతో ముఖం పాలిపోయి ఉంది.

రాహుల్‌కు అదేమి కనిపించకుండ వెళ్ళి కారులో కూర్చున్నాడు.

★ ★ ★

గౌతమీ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ వైపు పరుగులు తీస్తుంది. అప్పుడప్పుడే సూర్య కిరణాలు బోగీలలోకి జాలువారుతున్నాయి.

సైడ్‌బెర్త్‌పై ఆదమరచి నిద్ర పోతున్న ఆమె ముఖాన్ని సూర్యకిరణాలు చుంబించాయి.

ఉలిక్కిపడి లేచిందామె....

రిజర్వేషన్ బోగీ అంతా సికింద్రాబాద్ వెళ్ళే సీజనర్స్‌తో నిండిపోయి ఉంది.

చెదిరిన దుస్తులు సర్దుకుని కూర్చుం దామె.

తను కొవ్వూరు స్టేషనులో ఎక్కినప్పుడు ఉన్న ప్రయాణీకులు చాలా మంది లేరు.

ఆమె చూపులు ఎదురు బెర్త్ పైకి మళ్ళాయి.

రాత్రి ఆయన చూసిన చూపులు గుర్తుకు తెచ్చుకుని నవ్వుకుంది.

మరికొద్ది సేపట్లో సికింద్రాబాద్ స్టేషన్ వస్తుందనగా తన బెర్త్‌పై ఉన్న దుప్పటి సర్దుకుందామె. తలదిండు సర్దుతుండగా ఒక డైరీ కంటబడింది.

ఆ డైరీని ఆతృతగా చేతిలోకి తీసుకుంది.

దాన్ని తెరవాలనే ప్రయత్నానికి స్వస్థి పలికింది. ఇతరుల డైరీ చదవడం భావ్యం కాదనుకుంది.

చుట్టు ప్రక్కల అందరిని అడిగింది. కానీ ఎవరూ ఆ డైరీ ఆచూకీ చెప్పలేదు.

వెంటనే ఆమెకు ఒక ఆలోచన తట్టింది. డైరీ మొదటిపేజీలో అడ్రస్ ఉంటుంది కదా అని గబగబ డైరీలోని పేజీ తిప్పిందామె.

అక్షరాలు స్పష్టంగా కనిపించడం లేదు.

బ్యాగ్‌లో కళ్ళజోడు తీసుకుని పెట్టుకుంది.

ఇప్పుడు అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

జి. అమరేంద్ర, ఇంటి నెంబర్ 2-55-23 రాజమండ్రి. ఆమెకు అవే కనిపించాయి. అంతవరకే చదవగలిగింది.

చెమర్చిన కళ్ళను కర్చీఫ్‌తో తుడుచుకుని మరలా ఆ అక్షరాలను చదవడానికి ప్రయత్నించింది.

సాధ్యం కాలేదు. కళ్ళనుంచి ధారా పాతంగా కన్నీళ్ళు ప్రవిస్తున్నాయి.

తనను ఎవరూ గమనించకుండా ముఖం క్రిందకు వంచుకుని కన్నీళ్ళను తుడుచుకుంది.

కొద్ది సేపటికి బండి సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది.

బోగి నుంచి క్రిందకు దిగి దగ్గరలో ఉన్న గార్డు పెట్టెపై కూలబడింది.

ఉబికి వస్తున్న కన్నీళ్ళను అదిమిపెట్టి డైరీ మరోసారి తెరిచిందామె.

డైరీ రెండోపేజీ తిప్పింది..... అక్షరాలు ఆమెను జాలిగా చూస్తున్నాయి. ......హాలో.... మిమ్మల్ని చూస్తే నాకు అత్యంత ఆప్తురాలులా కనిపించారు. కారణం మాత్రం అడక్కండి. ఈ డైరీ నా ప్రాణం. ఈ ప్రాణాన్ని ఇన్నాళ్ళు పవిత్రంగా కాపాడుకుంటూ వచ్చాను. ఇక సాధ్యం కాదేమో! అందుకే నాలో నిభిడీకృతమైన భావాలకు ఉద్దీపనగా నిలిచిన మీకు ఈ డైరీని బహుకరిస్తున్నాను. దీన్ని మీరున్నంతకాలం భద్రపర్చండి. ఆ తర్వాత మీ ఇష్టం. అంత రిస్క్ ఎందుకు? అని అనుకుంటే దయచేసి దాన్ని పారేయకండి. వరంగల్‌లో ఈ అడ్రస్‌కు చేర్చండి. ఒక నెలరోజులపాటు ఇక్కడ ఉంటాను. ఇట్లు, మీకు శ్రమ ఇచ్చిన అమరేంద్ర.

అడ్రస్ మరలా చదువుకుందామె.

తన లగేజీని క్లాక్‌రూమ్‌లో ఉంచి రైల్వే ఎంక్వయిరీ వైపు వెళ్ళింది.

వరంగల్ పోయే రైలు మరో అర్థ గంటలో ఉందని చెప్పడంతో టికెట్ తీసుకుని ఐదవ నెంబర్ ప్లాట్‌ఫాంవైపు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది. ఆమె ముఖంపై ఏవో భావాలు అస్పష్టంగా దోబూచులాడటం దొంగ సూరీడు గమనిస్తూనే ఉన్నాడు.

# ఋతుదృశ్యం

**- సి. వేదవతి**

ఎప్పుడైనా చూచారా మీరు ?
సృష్టియావత్తు ముస్తాబయిపోవడం
కొత్త ఋతువు కోసం - కొత్తఅనుభవం కోసం
అంతా చిత్రంగా జరిగిపోతుంది
కనులముందే కనికట్టు చేసినట్లవుతుంది
అంతలోనే దృశ్యమంతా మారిపోతుంది
యావత్ప్రపంచానికీ యౌవనం వచ్చినట్లవుతుంది
హంగులన్నీ ఏర్పడిపోతాయి
ఋతువులు స్థలాలు మార్చుకునే సన్నివేశం కోసం !
అసలు ఋతువులు మారిపోవటం
ఒక రహస్య రసోజ్జ్వల చర్య
అంతా ఒక మహోత్సవంగా సాగిపోతుంది
అప్పుడున్న తొడుగులన్నీ విడిచేస్తుంది నిస్సంకోచంగా
అప్పటివరకూ ఉన్న ఆత్మధర్మాన్నీ త్యజిస్తుంది.
అంతా కొత్త వేషం - కొత్త పోకడ
మహా నిష్ఠ కల కర్మిష్ఠికాలం
అంతా చండశాసనం
క్షణమైనా ఆగకూడదు
అలుపు తీర్చుకొనడానికైనా -
గంట కొడుతుంది సమయం కాగానే
అందుకే అంత ఖచ్చితంగా జరిగిపోతుంది
ఋతువు మారే రసాయనికి చర్య
అంతగా గమనించం మనం
ఎంత స్పందనాభిరామంగా జరిగిపోతుందో
ఒక ఋతువటు మళ్లిపోవటం
ఒక ఋతువిటు రంగప్రవేశం చేయటం !
ఇట్లా రంగం మారిపోయేవేళ
రస రాగాలన్నీ కొత్తవి ఏర్పడిపోయేవేళ
ఈ ప్రదర్శనకంతా చిత్రంగా
ప్రకృతికి ప్రధమపాత్ర - ప్రధాన పాత్ర కూడా ఆమెదే !
అప్పుడావిడ ప్రదర్శిస్తుంది దృశ్యాత్మకంగా
సర్వరసస్వరూపాభినయం చేసే
సాలంకృత నర్తకిలాగా !
గాలికూడా గాత్రం సవరించుకొంటుంది
చెట్టూ చేమలకున్నూ వాళ్లు విదుల్చుకునే ప్రయత్నాలు
కొత్తపాటలు అందుకొంటాయి పక్షులు
వస్తున్న కొత్త ఋతువు వసంతమైతే
తానొక చైతన్య తరంగమవుతుంది సృష్టి సమస్తం
అంత నియతంగా ప్రదర్శిస్తుంది కాలం
ఎప్పటికప్పుడు ఈ చిత్రోత్సవాన్ని
చూస్తుంటే అదంతా ఒక అద్భుతానుభవం
కానీ చూడం మనం సాధారణంగా
మన తొందరలు మనవి - మన చికాకులు మనవి
ఎప్పుడైనా చూడాలనుకొన్నా
చిన్ననాడెరిగిన దృశ్య ప్రకృతిని
కంటికి కనిపించేదంతా వికృత ప్రకృతి దృశ్యమే !
భయపెడుతున్నాయి బులెట్లు పూస్తూ చెట్లన్నీ
కత్తులు దూస్తూ లతలూ చిగుళ్ళూ
ఇప్పుడు వసంతానిక్కూడా ఉగ్రరూపమే !
అంతా స్వయంకృతం !
అందుకే ఇప్పుడు నేనూ
ఋతు దృశ్యాలు చూడటం మానివేశాను.